క్లుప్తంగా

5,331 మంది లైసెన్స్‌ల రద్దు



ద్విచక్రవాహనాలను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారుల డ్రైవింగ్ లైసెన్సులను రద్దు చేసినట్టు ఉప రవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు. ఈ నెల 2 నుంచి 11 వరకు చేపట్టిన తనిఖీల్లో 5,985 మందిపై కేసులు నమోదు చేయగా 5,331 మంది వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్‌లు తాత్కాలికంగా రద్దు చేసినట్టు చెప్పారు. వాహనాల చట్టం సెక్షన్ 207 ప్రకారం డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి



వినోద్ నగర్‌లో సామాజిక భవనానికి శంకుస్థాపన చేస్తున్న బొమ్మిడి రమణ

గోపాలపట్నం: ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామని జోనల్ కమిషనర్ హైమావతి అన్నారు. 90వ వార్డు వినోద్‌నగర్‌లో రూ.33.50లక్షలతో నిర్మించ తలపెట్టిన సామాజిక భవనం పనులకు సోమవారం స్థానిక కార్పొరేటర్ బొమ్మిడి రమణతో కలసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ విభాగం ఏఈ వెంకటలక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, వినోద్ నగర్ అసోసియేషన్ ప్రతినిధులు ఏఎస్ఆర్ శ్రీను, అబ్దుల్ బషీర్, వేముల నర్సింగ్ రెడ్డి, యోగత్ ఈశ్వర్, నరవ పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

మల్కాపురం: మద్యం మత్తులో మెట్లపై నుంచి జారి గాయాలపాలైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. జీవీఎంసీ 63వ వార్డు జైఆంధ్ర కాలనీ ప్రాంతానికి చెందిన నాగరాజు (38) కూలి పనులు చేసుకుంటూ భార్యతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఇతను రెండు రోజుల కిందట ఫూటుగా మద్యం సేవించి ఇంటి మెట్లు ఎక్కుతూ జారి పడ్డాడు. ఈఘటనలో తలకు గాయం కావడంతో కుటుంబ సభ్యులు మల్కాపురం సెయింట్ ఆన్స్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మల్కాపురం పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాపూజీ కాలనీలో దివ్యాంగుడు..

మెట్లపై నుంచి జారిపడి గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలు.. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం సమీపంలోని బాపూజీకాలనీ ప్రాంతానికి చెందిన కూర్మారావు (35) అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. గత వారం ఇంటి మెట్లు ఎక్కుతూ జారి పడ్డాడు. గాయాలపాలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మెట్లపై జారి పడినప్పుడు తలకు బలమైన గాయం అయ్యిందని,అందువల్లే కూర్మారావు మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు.

'చలో వాల్తేరు డిపో' నేడు

మద్దిలపాలెం: విశాఖ జిల్లా ప్రజా రవాణా శాఖలో అపరిష్కృత సమస్యలపై మంగళవారం నిర్వహించనున్న చలో వాల్తేరు డిపో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావులు పిలుపునిచ్చారు. వాల్తేరు డిపో వద్ద అనేక రోజులుగా ఆందోళనలు చేస్తున్నప్పటికీ యాజమాన్యం స్పందించకపోవడానికి నిరసనగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు.

ఏం తినాలి.. ఎలా బతకాలి?

కూటమి ప్రభుత్వం తీసుకు వచ్చిన ఇసుక పాలసీతో నిర్మాణ రంగం కుంటుపడింది. ఇసుక లభించక భవన నిర్మాణాలు చాలా చోట్ల నిలిచిపోయాయి.ఫలితంగా నిర్మాణ రంగ కార్మికులు పనుల్లేక పస్తులు ఉంటున్నారు. పనుల కోసం అడ్డాపైకి వచ్చి నిరీక్షించినా.. ఎవరూ పనికి పిలవక పోవడంతో ఉసూరుమంటూ వెనుతిరుగుతున్నారు. రోజుల తరబడి పనులు లేక పోతే ఏం తినాలి.. ఎలా బతకాలి అని భవన నిర్మాణ కార్మికులు వాపోతున్నారు.

- ఇసుక కొరతతో పనులు నిలిపేసిన భవన నిర్మాణదారులు
- పనుల్లేక కూలీల పస్తులు



గోపాలపట్నం ప్రాంతంలో సగంలో ఉన్న నిర్మాణం



ఎన్ఏడీ జంక్షన్ కింద నిరీక్షిస్తున్న కూలీలు

గోపాలపట్నం: ఇసుక కొరతతో రోజువారీ కూలీలకు పస్తులు తప్పడం లేదు. మూడు నెలల్లో కనీసం 20 రోజులు కూడా పని దొరకలేదని వాపోతున్నారు. ఎన్ఏడీ జంక్షన్‌లో నిర్మాణ రంగ పనుల కోసం రోజువారీ కూలీలు సుమారు 500 మంది వేచి చూస్తుంటారు.

మట్టి పని, సిమెంట్ వంటి పనులు అవసరమైన వారు ఇక్కడికి వచ్చి తాపీమేస్త్రిలతో పాటు కూలీలను పనికి తీసుకెళ్తారు. అయితే పాలకుల నిర్లక్ష్యం వల్ల ఇసుక దొరకడం గగనం కావడంతో నిర్మాణ పనులు 80 శాతం వరకూ నిలిచిపోయాయి. దీంతో జంక్షన్‌లోకి వచ్చి ఏ బండి.. కారు ఆగినా కూలీలు ఆశతో వారి దగ్గరకు పరుగులు పెడుతున్నారు. ఏదైనా పని దొరుకుతుందా... పూట గడుస్తుందా అన్న ఆతృత వారిలో కనిపిస్తోంది. ఉదయం 7.30 గంటల నుంచి విశాఖ శివారు ప్రాంతాలతో పాటు విజయనగరం జిల్లా నుంచి నిర్మాణ రంగ పనుల కోసం కూలీలు వస్తుంటారు. రవాణా ఖర్చులు రోజుకు రూ.150 నుంచి రూ.200 వరకు అవుతున్నాయని చెబుతున్నారు. పని లేక పోతే ఈ ఖర్చులు అదనపు భారం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రోజూ కాకపోయినా నెలలో కనీసం 23 రోజుల వరకూ పని దొరికేదని చెబుతున్నారు.

పల్లెల్లో ఉపాధి కరువై..

పల్లెల్లో పనులు లేక నగరంలోకి వస్తే ఇసుక కొరత వల్ల ఇప్పుడు ఇక్కడ కూడా పని దొరకడం లేదని వాపోతున్నారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మొదట్లో ఇబ్బందులు పడినా తర్వాత ఇసుక సక్రమంగా దొరకడంతో పనులు లభించాయని.. కూటమి ప్రభుత్వంలో మాత్రం పనులు లేక అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు. ఇసుక పాలసీపై సరైన నిర్ణయం తీసుకోకపోతే పస్తులతో చావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక రోజు సంపాదించిన కూలి నాలుగు రోజులు తిరిగేసరికి ఖర్చు అయిపోతుందని ఇక ఇల్లు గడిచేది ఎలాఅని వాపోతున్నారు. ఇసుక దొరక్క.. అధిక ధరలకు కొనుగోలు చేయలేక భవన నిర్మాణారులు పనులు నిలిపేస్తున్నారని వాపోతున్నారు. రోజూ మధ్యాహ్నం వరకు ఎదురు చూసి నిరాశతో వెనుదిరుగుతున్నారు.



పని కోసం ద్విచక్ర వాహనదారుడి చుట్టూ చేరిన కూలీలు



ఇసుకలేక నిలిచిపోయిన నిర్మాణం

పనుల్లేక ఇబ్బందులు



ఇసుక కొరత వల్ల పనుల్లేక ఇబ్బందులు పడుతున్నాం. వారానికి ఒక రోజు కూడా పని దొరకడం లేదు. విజయనగరం నుంచి వస్తున్నాం. మాకు చార్జీలే రూ.150 వరకు అవుతున్నాయి. కనీసం రెండు రోజులకోసారైనా పని దొరికితే మాకు కొంత వెసులుబాటు ఉంటుంది. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో కుటుంబాన్ని పోషించేందు ఇబ్బందులు పడుతున్నాం.

– పి. రమణ, కూలీ, కోరుకొండ, విజయనగరం

ఇసుక ధర పెరిగిపోయింది



పనులు ఆపేశారని ఎవరినీ ఏమీ అనలేని పరిస్థితి. ఇసుక ధర ఇంత వరకు చూడలేని విధంగా పెరిగి పోయింది. చాలా దారుణంగా ఉంది. మాకు ఇసుక మహమ్మారిలా తయారైంది. పనులు లేక ఇబ్బందులు పడుతున్నాం. కుటుంబ అవసరాల కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. గతంలో ఇంత దారుణం లేదు.

– స్వామి నాయుడు, మేస్త్రి, అలమండ

ఇలాంటి పరిస్థితి ఎన్నడూ లేదు



ఇసుక కోసం ఇంతా దారుణమైన పరిస్థితి ఎప్పుడూ చూడలేదు. పనిలేకుండా కూర్చోవడం బాధగా ఉంది. ఇదే విధంగా నెల రోజులు గడిస్తే కుటుంబమంతా పస్తులుండాల్సిందే. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఏదో ఒక విధంగా సాయమందేది. ఇప్పుడు అదీలేదు. సూపర్ సిక్స్ అమలు చేయ లేదు. కూలి పనులు లేవు. పేదలు ఎలా బతకాలి.?

– మద్దాల అప్పారావు, మేస్త్రి, లక్ష్మీనగర్

ములగాడ తహసీల్దార్ కార్యాలయంలో బదిలీలు



ములగాడ తహసీల్దార్ కార్యాలయం

మల్కాపురం: ములగాడ తహసీల్దారు కార్యాలయంలో పలువురు అధికారులకు బదిలీలు జరిగాయి. ఈ కార్యాలయంలో చాలా ఏళ్లుగా తిష్ట వేసుకున్న వారితో పాటు కొత్తగా నెలరోజులైనా పూర్తి కానివారు కూడా బదిలీ కావడం గమనార్హం. ఈ కార్యాలయంలో ఒకేసారి ఇంతమంది అధికారులకు బదిలీ కావడం ఇదే మొదటిసారి.

ములగాడ తహసీల్దారుగా భుజంగరావు

ములగాడ తహసీల్దారుగా పార్వతీపురం తహసీల్దారు భుజంగరావు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన తారకేశ్వరి గత నెల 29నే బాధ్యతలు స్వీకరించారు. రెండు నెలలు కూడా పూర్తి కాకముందే ఆమెను జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఎస్టేట్ ఆఫీసుకు బదిలీ చేశారు.

డీటీ, ఆర్ఐల బదిలీ

- డిప్యూటీ తహసీల్దార్‌గా ఇక్కడ కొన్నేళ్లుగా చేస్తున్న నాగలక్ష్మి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో గాజువాక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ త్రినాథ్ ఇక్కడికి వస్తున్నారు.
- గత వారం ఈ కార్యాలయంలో ఆర్ఐగా బదిలీపై వచ్చిన రమాను కూడ ఇక్కడి నుంచి బదిలీ చేశారు. ఆమె స్థానంలో ఆర్ఐ విద్యకు పోస్టింగ్ ఇచ్చారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు సత్కారం

మల్కాపురం: ఇటీవల విజయవాడలో వరదల కారణంగా ముంపునకు గురైన ప్రాంతాల్లో సేవలందించిన 60వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్ యాదవ్‌ను ఎమ్మెల్యే పి.గణబాబు సత్కరించారు. వార్డు పరిధి ఇందిరాకాలనీలో సామాజిక భవనం వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయవాడలో అజిత్‌సింగ్ నగర్‌లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి, సాధారణ స్థితికి తీసుకురావడానికి తోటి సిబ్బందితో కలసి సతీష్‌యాదవ్ ఎంతో శ్రమించారని తెలిపారు. విధి నిర్వహణలో ఆయన అంకిత భావాన్ని కొనియాడారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలట్నం: జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు సోమవారం వైద్య పరీక్షలు చేశారు. లక్ష్మీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద సఫాయిమిత్ర సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన శిబిరాన్ని ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రోజు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు కష్టపడుతున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం కాపాడేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. జీవీఎంసీ 90, 91, 92, 98 వార్డుల కార్మికులు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో జోన్–8 కమిషనర్ హేమావతి, ఎస్ఎస్ ఎస్‌వీ రమణ, గోపాలపట్నం 30 పడకల ఆస్పత్రి సూపరింటెండెంట్ సుజాత, పలు విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

మూడు దశాబ్దాల స్నేహసుగంధం



గోపాలపట్నం హైస్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

గోపాలపట్నం: బాల్యం ప్రతి ఒక్కరికీ మరపురాని జ్ఞాపకం. చిన్ననాటి స్నేహితులు కనిపిస్తే ఆ స్మృతుల పరిమళం మనసును మళ్లీ బాల్యంలోకి పరుగులు తీసేలా చేస్తుంది. ఒకేసారి 150 మంది బాల్యమిత్రులు ఒకచోట చేరితే వారి ఆనందానికి అవధులే ముంటాయి. ఆ అపూర్వ కలయికకు గోపాలపట్నం హైస్కూల్ వేదికైంది. ఆ పాఠశాలలో 1983–84 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులందరూ 30 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఒకచోట చేరారు. నాటి జ్ఞాపకాల్లో మునిగి తేలారు. అక్కడే చెట్ల కింద కూర్చుని తాము చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు పాఠశాల బాగా అభివృద్ధి చెందిందని, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు సమకూరాయని ముచ్చటపడ్డారు. తమకు చదువు నేర్పిన గురువులను సత్కరించుకున్నారు. మళ్లీ కలుసుకుందామంటూ మధురజ్ఞాపకాలను పదిలంగా దాచుకుని వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పాసర్ల ప్రసాద్, బాలసుబ్రహ్మణ్యం, నందవరపు సోములు, బండారు త్రినాథ్, ఐ.గోవింద్, మొందూరి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి



ఉక్కు ప్రధాన పరిపాలన భవనం వద్ద ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్‌ను విలీనం చేయడంతోనే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఉక్కు కార్మిక సంఘాల నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఉక్కు ప్రధాన పరిపాలన భవనం వద్ద సోమవారం పెద్ద ఎత్తున ధర్నా చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్ల కార్మిక వర్గం తీవ్ర ఇబ్బందులు పడుతుందన్నారు. కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కి ప్రభుత్వ రంగాన్ని నాశనం చేస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రస్తుత పరిస్థితికు కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. పూర్తి సామర్థ్యంతో ప్లాంట్ నడిపితే మనుగడ ఉంటుందన్నారు. కార్మిక చట్టాల స్థానంలో ప్రవేశపెట్టిన 4 కోడ్‌లను ఉపసంహరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు కె.ఎస్.ఎన్. రావు, డి. ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు జె. అయోధ్యరామ్, యు. రామస్వామి, వై.టి.దాస్, జె. రామకృష్ణ, నరేష్‌కుమార్, వరసాల శ్రీనివాస్, దొమ్మేటి అప్పారావు, బి. డేవిడ్, మహాలక్ష్మి నాయుడు, సురేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రజా సహకారంతో కాలుష్య రహిత నగరం

అల్లిపురం: కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆమె తన క్యాంప్ ఆఫీస్ నుంచి ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకొని అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా.. దాని నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను ఉపయోగించాలని నిర్ణయించిదన్నారు. ఈ మేరకు జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు ప్రజా రవాణాలను ఉపయోగిస్తున్నారని చెప్పారు. నగర పర్యావరణ పరిరక్షణకు, జీవీఎంసీ అనేక అవగాహన కార్యక్రమాలు నిత్యం చేపడుతోందని తెలిపారు. వారంలో ఒక రోజు ప్రజా రవాణా వ్యవస్థను, సైకిళ్లను ఉపయోగించడం వల్ల కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రిచవచ్చని చెప్పారు.

ఘనంగా బెహరా పుట్టిన రోజు



కేక్ కట్ చేస్తున్న బెహరా విజయచైతన్య, రవి తేజ తదితరులు

గోపాలపట్నం: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు పుట్టిన రోజు వేడుకలను సోమవారం ఆయన ఇంటి వద్ద ఘనంగా నిర్వహించారు. బెహరా విద్యాసంస్థల కార్యదర్శి బెహర విజయచైతన్య, బెహరా ఆస్పత్రి ఎండీ రవితేజ కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో 92వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొర్లె అప్పలస్వామి నాయుడు, నాయకులు కర్రి సత్తిబాబు, దవళ గోపాల్, గేదెల మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు డ్యాన్స్‌లో శిక్షణ



డ్యాన్స్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు జవహర్‌నగర్ రోడ్డులోని బన్నీ డ్యాన్స్ స్కూల్‌లో చిన్నారులకు డ్యాన్స్‌లో శిక్షణ ఇస్తున్నట్టు డ్యాన్స్ మాస్టర్ బన్నీ తెలిపారు. దసరా సెలవులు వస్తున్న తరుణంలో 15 రోజుల పాటు రాక్,వెస్ట్రన్,డిస్కో,ఫోక్ డ్యాన్స్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే సంగీతంలో కూడా శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు.ఆసక్తి ఉన్న వారు స్కూల్‌కు వచ్చి సంప్రదించాలని సూచించారు.

టిడ్కో ఇళ్లు పంపిణీ చేయాలని ఆందోళన



పెదగంట్యాడలో ర్యాలీ నిర్వహిస్తున్న టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు

పెదగంట్యాడ: సొంతింటి కలను నిజం చేస్తారని ఎనిమిదేళ్లుగా ఎదురు చూస్తున్నామని, కట్టిన ఇళ్లు మంజూరు చేయకపోయినా బ్యాంక్ రుణాలు కట్టాల్సి వస్తోందని టిడ్కో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పక్క ఇంటి అద్దెలు చెల్లించలేక అవస్థలు పడుతుంటే మరో పక్క బ్యాంక్ రుణాలు కట్టాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. భానోజీతోట, దయాళ్‌నగర్, దువ్వాడ తదితర ప్రాంతాల్లో 2017లో టీడీపీ ప్రభుత్వం నిర్మించిన ఇళ్లు తమకు మంజూరయ్యాయని, అప్పట్లో రూ.25వేలు వంతున డీడీలు చెల్లించినా ఇళ్లు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. ఈ మేరకు లబ్ధిదారులు సోమవారం పెదగంట్యాడ పీహెచ్‌సీ వద్ద ఆందోళనకు దిగారు. ఆపై బీసీ రోడ్డు మీదుగా పెదగంట్యాడ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పెదగంట్యాడ పీహెచ్‌సీ వద్ద శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన జోన్–6 జోనల్ కమిషనర్ బీఆర్ ఎస్ శేషాద్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. కనీస సదుపాయాలు అయిన రోడ్లు, కాలువలు, విద్యుత్, తాగునీరు కల్పించి వెంటనే గృహాలు అందజేయాలని కోరారు. స్పందించిన కమిషనర్ ఈ నెల 26 తర్వాత స్వయంగా వచ్చి పరిశీలిస్తానని చెప్పారు.

వేతనాలు అందక ఆస్పత్రి సిబ్బంది ఆందోళన

- ఐదు నెలలుగా జీతాలు రాక అప్పులతో జీవనం
- పట్టించుకోని పాలకులు, ఉన్నతాధికారులు



గుల్లలపాలెంలోని ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రి

మల్కాపురం : నిత్యం రోగులకు సేవలు అందిస్తున్న ఆస్పత్రి సిబ్బందికి ఐదు నెలలుగా వేతనాలు అందక అప్పులు చేసుకుని జీవనం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. వీరి సమస్యపై అధికారులు, పాలకులు పట్టనట్టు వ్యవహరిస్తుండడంతో ఎన్నాళ్లీ కష్టాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 60వ వార్డు పరిధి గుల్లలపాలెం వద్ద నిర్మించిన 30 పడకల ఆస్పత్రి (ఎఫ్ఆర్‌యు ఆస్పత్రి)లో సుమారు 17 మంది సిబ్బంది (ఒప్పంద కార్మికులు) పని చేస్తున్నారు. నలుగురు ఏఎన్ఎంలు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మాసిస్ట్, క్లాస్‌ఫోర్ సిబ్బంది ఆరుగురు, అంబులెన్స్ డ్రైవర్ ఒకరు పని చేస్తున్నారు. వీరిలో ఏఎన్ఎంలకు నెలకు రూ.15 వేలు, స్టాఫ్ నర్సులకు నెలకు రూ.17 వేలు, ల్యాబ్ టెక్నీషియన్‌కు నెలకు రూ.15 వేలు, ఫార్మాసిస్ట్‌కు నెలకు రూ.17 వేలు, క్లాస్ ఫోర్ ఉద్యోగులకు నెలకు రూ.15 వేలు, అంబులెన్స్ డ్రైవర్‌కు నెలకు రూ.10 వేలు వంతున గతంలో వేతనాలు చెల్లించేవారు. ఈ చాలీచాలని జీతాలతో బతుకు లాగిస్తుంటే ఇప్పుడు వీరికి గత ఐదు నెలల నుంచి వేతనాలు అందకపోవడంతో అప్పులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సకాలంలో వేతనాలు చెల్లించాలని ఉన్నతాధికారులను వేడుకుంటున్నా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు, ఉన్నతాధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు.

హెచ్‌ఆర్‌ఏ కొనసాగించాల్సిందే..

కార్మిక సంఘాల డిమాండ్



స్టీల్‌ప్లాంట్ సీఎండీ, డైరెక్టర్లతో చర్చలు జరుపుతున్న కార్మిక నాయకులు

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ఇంటి అద్దె (హెచ్ఆర్ఏ), ఎల్‌టీసీ, ఎల్ఎల్‌టీసీ, ఎల్‌టీఏలను నిలిపి వేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉక్కు అడ్మిన్ బిల్డింగ్‌లో ఈ అంశంపై ఆందోళన చేశారు. సీఎండీ కార్యాలయం ముందు బైఠాయించారు. దీంతో హెచ్ఆర్ సీజీఎం కార్మిక సంఘాలతో జరిగిన చర్చల్లో డైరెక్టర్ (పర్సనల్) సమక్షంలో చర్చలు జరపడానికి ప్రతిపాదించారు. దీనికి అంగీకరించని కార్మిక సంఘాలు నిర్ణయాధికారం ఉన్న సీఎండీతో మాట్లాడతామని పట్టుబట్టారు. దీంతో సీఎండీ అరుణ్ కాంతి బాగ్చి, డైరెక్టర్ ఎస్.సి. పాండే, హెచ్ఆర్ సీజీఎం జి.గాంధీలతో చర్చించారు. ఉత్తర్వులు రద్దుపై పున:పరిశీలించడానికి సీఎండీ బాగ్చి సమయం కోరారని నాయకులు తెలిపారు. సమావేశంలో నాయకులు జె. అయోధ్యరామ్, కె.ఎస్.ఎన్. రావు, గణపతి రెడ్డి, నమ్మి సింహాద్రి, వరసాల శ్రీనివాస్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ వారి కార్యాలయం, గోపాలపట్నం

రిక.నెం.1079/2024/ఎ/తేది 20-09-2024

పత్రికా ప్రకటన

గోపాలపట్నం మండలం, కప్పరాడ గ్రామ కాపురస్తులు **శ్రీ కె.జె.యస్.యస్. వెంకటేష్,** తండ్రి కె.రామచంద్రరావు, ఇంటి నెం. 11-268, ఫ్లాట్ నెం. 56, కృష్ణానగర్, గోపాలపట్నం, విశాఖపట్నం వారు ఈ క్రింది పట్టికలో తెలిపిన స్థలమునకు 'నిరభ్యంతర ధృవీకరణపత్రం' (NOC) మంజూరు చేయవలసినదిగా కోరియున్నారు.

గ్రామం పేరు	సర్వే నెం.	విస్తీర్ణము
గోపాలపట్నం గ్రామం	సర్వే నెం. 1/2 బి భాగం సర్వే నెం. 1/3 భాగం	199 చ.గ.

పైన తెలిపిన భూమికి 'నిరభ్యంతర ధృవీకరణ పత్రము' (NOC) మంజూరు చేయుటకు ఎవరికైన ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 15 దినములలోగా శ్రీ జాయింటు కలక్టరు మరియు కాంపిటెంట్ అథారిటీ, అర్బన్ ల్యాండ్ సీలింగ్, కలక్టరు కార్యాలయము, విశాఖపట్నం వారికి మరియు శ్రీ తహసీల్దార్, గోపాలపట్నం వారికి లిఖితపూర్వకముగా తెలియజేయవలసినదిగా కోరడమైనది.

తహసీల్దార్, గోపాలపట్నం మండలం, విశాఖపట్నం